క్లుప్తంగా

ఉత్సవాల ఆచారాన్ని కొనసాగించండి

ఇల్లెందు: పట్టణంలో దసరా ఉత్సవాలను జమ్మి గ్రౌండ్ లేదా ఫారెస్టు మైదానంలో నిర్వహించి అనాదిగా వస్తున్న ఆచారాన్ని కొనసాగించాలని మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మడత వెంకట్‌గౌడ్ కోరారు. ఈ సందర్భంగా మంగళవారం ఇల్లెందులో నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణ అనంతరం ఆయన తహసీల్దార్ రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. మాట్లాడుతూ.. ఉత్సవాలను సింగరేణి స్కూల్ గ్రౌండ్‌లో నిర్వహిస్తే ప్రజలకు ఇబ్బందిగా ఉంటుందని తెలిపారు. అలాగే ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఉత్సవాల నిర్వహణను కమిటీకి అప్పగించాలని కోరారు. కార్యక్రమంలో దండు సారయ్య, బోడేపూడి రాజబాబు, శ్రీధర్, సతీష్ పాల్గొన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి


పుస్తకాలను ఆవిష్కరిస్తున్న కమిషనర్ స్వామి

పాల్వంచ: యువత గ్రంథాలయాను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎ.స్వామి అన్నారు. మంగళవారం స్థానిక గ్రంథాలయంలో జిల్లా గ్రంథాలయ సంస్థ నుంచి ఉపాధ్యాయ ఉద్యోగాలకు పోటీ పడే విద్యార్థుల కోసం ప్రభుత్వం నుంచి వచ్చిన పుస్తకాలను కమిషనర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సీఎస్ఆర్ ఫండ్స్ ద్వారా విద్యార్థులకు కావాల్సిన పుస్తకాలను సైతం అందిస్తామన్నారు. ఐటీసీ ఏర్పాటు చేసిన నూతనంగా నిర్మించిన డిజిటల్ లైబ్రరీని అందుబాటులోకి రానుందని, దీనిలో కూడా పుస్తకాలు అందుబాటులో ఉంచుతామని చెప్పారు. డీఈ మురళీ, లైబ్రేరియన్ మధుబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎడవల్లికే కాంగ్రెస్ టికెట్ కేటాయించాలి

పాల్వంచ: టీపీసీసీ సభ్యుడు ఎడవల్లి కృష్ణకే కాంగ్రెస్ పార్టీ టికెట్ కేటాయించాలని పాల్వంచ పట్టణ అధ్యక్షుడు నూకల రంగారావు అన్నారు. మంగళవారం స్థానిక శ్రీనివాస కాలనీలో ఏర్పాటు చేసిన మండపంలో కనకదుర్గ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ.. ఎనిమిది సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తున్న ఎడవల్లికి అధిష్టానం తగు ప్రాధాన్యం కల్పించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ బలంగా ఉన్న నియోజకవర్గంలో సీపీఐకి కేటాయించడం సరికాదన్నారు. కార్యక్రమంలో కట్టా సోమయ్య, ఎస్కే చాంద్‌పాషా, ఎస్కే షఫీ, వసంతరావు, వీరు నాయక్, సూరిబాబు, సూర్యకిరణ్, భానుతేజ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

టేకులపల్లి: ఎన్నికల షెడ్యూల్ విడుదల అయిన నేపథ్యంలో అడుగడుగునా పోలీసుల నిఘా పెరిగింది. నిబంధనలకు విరుద్ధంగా నగదు, మద్యం, బంగారం సరఫరాను అరికట్టేందుకు పోలీసులు, స్క్వాడ్ బృందాలు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. ఈ మేరకు మంగళవారం టేకులపల్లి సీఐ ఇంద్రసేనారెడ్డి ఆదేశాల మేరకు టేకులపల్లి ఎస్ఐ గన్‌రెడ్డి రమణారెడ్డి ఆధ్వర్యంలో టేకులపల్లి సెంటర్‌లో, బోడు ఎస్ఐ రంజిత్ ఆధ్వర్యంలో బోడులో వాహన తనిఖీలు నిర్వహించారు. వచ్చిపోయే కార్లు, బైక్‌లను తనిఖీలు చేపట్టారు.

కేటీపీఎస్‌లో ఓవర్‌మెన్ల సమస్యలు పరిష్కరించాలి


కేటీపీఎస్‌లో మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఓవర్‌మెన్లు

టేకులపల్లి: కోయగూడెం ఓపెన్ కాస్టులో ఓవర్ మెన్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం ఓవర్ మెన్లు కేటీపీఎస్ మేనేజర్ సౌరభ్ సుమన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. షిఫ్టుల్లో తనిఖీలు నిర్వహించేందుకు యాజమాన్యం రెండు బొలెరో వాహనాలు ఏర్పాటు చేసినప్పటికీ మూడు నెలల అవి సరిగా నడవడం లేదని, డ్రైవర్లు అందుబాటులో ఉండటం లేదని వాపోయారు. ఈ సమస్యపై బొలెరో యజమానులకు పలుమార్లు చెప్పినా వారు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వాహనాలు అందుబాటులో లేకపోవడం వల్ల సకాలంలో తనిఖీలు చేయలేకపోతున్నామని పేర్కొన్నారు. సింగరేణి అధికారులు స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఓవర్‌మెన్లు రవి, నవీన్, అనిల్, వీరన్న, రాహుల్, బాలు, ఇంతియాజ్, సత్యనారాయణ, రామారావు, మనోజ్, వి.శంకర్, రామకృష్ణ, రాజేష్, ఎంకే శంకర్ పాల్గొన్నారు.

మౌలిక వసతులు కరువు

గుట్ట దిగి వలసబాట
- రంగాపురం గుట్టను ఖాళీ చేసి వెళ్లిన కుటుంబాలు
- ఎవరూ పట్టించుకోక ఇక్కట్లు


గుట్టపైన నివాసం ఉంటూ తట్టలు, బుట్టలు అల్లుతున్న మహిళలు (ఫైల్)

పాల్వంచరూరల్: బతుకుదెరువు కోసం వచ్చి నాడు రోడ్డు వెంట డేరాలు వేసుకుని ఉన్న పది నిరుపేద కుంటుబాలను అధికారులు రోడ్డు మీద లేకుండా గుట్టపైకి తరలించారు. అక్కడ ఇల్లు కూడా కట్టించారు. కానీ కనీస సౌకర్యాలు కల్పించకపోవడంతో ఇబ్బందులను తట్టుకోలేక గుట్ట మీద ఉన్న గూళ్లను ఖాళీ చేసి వలస వెళ్లారు. మండల పరిధి రంగాపురం గ్రామ రహదారి పక్కన ఇతర జిల్లాల నుంచి 20 సంవత్సరాల క్రితం వలస వచ్చిన పది కుటుంబాలకు చెందిన సుమారు 40 మంది బుట్టలు అల్లి పట్టణంలో, సంతల్లో విక్రయించి వచ్చిన ఆదాయంతో జీవనం గడుపుతున్నారు. రోడ్డు పక్కన ఉన్న కుటుంబాలను నాయకులు, అధికారులు అక్కడ ఉండకుండా గ్రామ సమీపంలో ఉన్న గుట్ట మీదకు తరలించారు. అక్కడ వారికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి నిర్మించారు. కానీ గుట్టపై నివాసం ఉండేందుకు కనీసం రహదారి సౌకర్యం లేదు. చెరువు మధ్య నుంచి గ్రామానికి రాకపోకలు సాగించారు. వర్షాకాలంలో చెరువు అలుగుపోస్తే గుట్టపైకి రాకపోకలు నిలిచిపోయేవి. దీనికి తోడు తాగునీరు లేదు. గతంలో ఒక బోరు వేశారు. అది కూడా పనిచేయకపోవడంతో తాగునీటి కోసం ప్రతి సంవత్సరం నిరుపేదకుటుంబాలు దూరప్రాంతంలో వ్యవసాయ బావుల వద్ద, శ్మశాన వాటిక నుంచి తాగునీరు తెచ్చుకుని దాహార్తిని తీర్చుకుని జీవనం సాగించారు.

సమస్యలను పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు...

ఏళ్ల తరబడి తాగునీటి సమస్య, రోడ్డు సౌకర్యం కల్పించాలని, గ్రామానికి ఎదురుగా శ్మశాన వాటిక నిర్మించడంతో నివాసం ఉండలేని పరిస్థితి ఉందని శ్మశాన వాటికను తరలించాలని ప్రజాప్రతినిధులు, అధికారులు, కలెక్టర్లను పలుమార్లు కోరినా పట్టించుకోలేదు. దీంతో గత్యంతర లేక చేతివృత్తులను వదిలి, గుట్టపైన ఉన్న ఇళ్లను ఖాళీ చేసి ఇతర ప్రాంతాలకు, పట్టణాలకు వలస వెళ్లారు.


రంగాపురం గుట్టపై ఖాళీగా ఉన్న ఇళ్లు

నిర్మానుష్యంగా మారిన రంగాపురం గుట్ట..

రంగాపురం గుట్టపై ఉన్న పది కుటుంబాల ఇటీవల ఖాళీ చేసి ఇతర ప్రాంతాలకు వెళ్లిపోవడంతో ఆ గుట్ట ప్రాంతం నిర్మానుష్యంగా మారింది. గుట్టపై కుటుంబాలు ఉన్నప్పుడు సందడిగా ఉండేది.

ఇంటి అద్దె కట్టలేక పోతున్నాం



గుట్టపైన పాములు, విషకీటకాల మధ్య క్షణక్షణం భయ పడుతూ 20 ఏళ్లు గుట్టపైన నివాసం ఉన్నాం. తాగునీరు లేక తట్టులేక గుట్టపై నుంచి వచ్చి పాల్వంచ పట్టణంలో ఇళ్లను అద్దెకు తీసుకుని నివాసం ఉంటున్నాం. బుట్టలు, తట్టలు అల్లే పరిస్థితి లేక ఇళ్లల్లో పనులు చేస్తున్నాం. ఇంటి అద్దెలు భారంగా మారాయి. – వెలుగు ఉపేంద్ర

ప్రభుత్వం ఆదుకోవాలి



గుట్టపైన ఇబ్బందులు పడుతూ ఇంతకాలం జీవనం సాగించిన మాకు కనీస సౌకర్యాలు లేనికారణంగా గుట్ట దిగి పట్టణంలోకి వచ్చాం. చేసే వృత్తిని వదిలేసి రోడ్డు మీద కంకులు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నాం. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు మంజూరు చేసి ప్రభుత్వం ఆదుకోవాలి. – కూరాకుల లలిత

బతుకు భారంగా మారింది



గుట్ట మీద ఉన్న పది కుటుంబాలు మొత్తం ఈత చువ్వలతో తట్టలు, బుట్టలు తయారు చేసి వాటిని పట్టణంలో, సంతల్లో విక్రయించి కుటుంబాలను పోషించుకుంటూ జీవనం సాగించాం. గుట్ట మీద సౌకర్యాలు లేక గూడు వదిలి పట్టణంలో కూలీ పనులు చేసుకుంటున్నాం. అధికారులు స్పందించి పింఛన్లు ఇప్పించాలి. – తిరుపతమ్మ

చెరువు కబ్జాపై చర్యలు తీసుకోండి


మాట్లాడుతున్న అన్నవరపు కనకయ్య

పాల్వంచ: మున్సిపాలిటీ పరిధిలోని ఎర్రగుంట చెరువును కబ్జా చేసిన వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని, లేదంటే ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య అన్నారు. మంగళవారం స్థానిక ఎర్రగుంట గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 16 ఎకరాల చెరువును దొడ్డిదారిన పట్టా పాస్ పుస్తకాలు సృష్టించి, రైతుల అవసరాల కోసం ఉన్న చెరువును వ్యవసాయ భూమిగా మార్చే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. దానిని గ్రామస్తులు అడ్డుకోగా వారిపై అక్రమ కేసులు పెట్టించి బెదిరింపులకు దిగుతున్నారని, పేద రైతులకు అన్యాయం జరుగుతున్నా అధికారులు నిమ్మకు నిరెత్తనట్లు వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. మాజీ నక్సలైట్‌నని, తెలంగాణ ఉద్యమకారుడినని బెదిరింపులకు దిగుతున్నారని, గతంలో పనికి ఆహార పథకం కింద రెండుసార్లు చెరువు పూడిక తీత జరిగిన రికార్డులున్నాయన్నారు. గతంలో తహసీల్దార్, కలెక్టర్, ఇరిగేషన్ కార్యాలయాల వద్ద ధర్నాలు చేసిన క్రమంలో అప్పటి కలెక్టర్ ఆ పట్టాలను రద్దు చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. సమావేశంలో సీపీఎం పట్టణ కార్యదర్శి దొడ్డా రవికుమార్, కృష్ణారెడ్డి, ఎర్రగుంట సాంబశివరావు, జ్యోతి, గడ్డం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేలు మారినా అభివృద్ధి జాడేది?


పీసువాగు ప్రాజెక్టు వద్ద మాట్లాడుతున్న కామేష్

పాల్వంచరూరల్: నలుగురు ఎమ్మెల్యేలు మారినా గిరిజన రైతుల పంటల సాగుకు నీరు అందించే పీసువాగు ప్రాజెక్టును నేటికీ పూర్తి చేయకుండా నిర్లక్ష్యం వదిలేశారని కొత్తగూడెం బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి యెర్రా కామేష్ అన్నారు. ఉల్వనూరు, నర్సింహసాగర్, గంగాదేవిగుప్పా, కొత్తబంజర, పాతబంజర గ్రామాల్లో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామస్తులతో కలిసి పీసువాగు ప్రాంతాన్ని సందర్శించారు. మాట్లాడుతూ.. 1989లో మంజూరైన ప్రాజెక్టును ఇంతవరకు పూర్తిచేయలేదని విమర్శించారు. ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే మల్లారం, నర్సింహసాగర్, లక్ష్మీదేవిపల్లి, బంజర, గుండ్లమడుగు తదితర గ్రామాల్లో ఐదు వేల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఎస్పీని గెలిపిస్తూ ఆరునెలల్లో పీసువాగు ప్రాజెక్టు పనులను చేస్తామన్నారు. కాటబోయిన వసుంధర, కోళ్లపూడి ప్రవీణ్‌కుమార్, బండి రమణి, మల్లిక, ముంతాజ్ పాల్గొన్నారు.

జూలూరుపాడు: బీఎస్పీ వైరా ఎమ్మెల్యే అభ్యర్థి బానోత్ రాంబాబు నాయక్ మంగళవారం కాకర్ల గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ తిరుగుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ బీఎస్పీ అధికారంలోకి వస్తే చేపట్టే అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. మాట్లాడుతూ.. 2009లో వైరా నియోజకవర్గం ఏర్పడి తరువాత తొలిసారిగా సీపీఐ నుంచి పోటీ చేసి గెలుపొందిన ఎమ్మెల్యే బానోత్ చంద్రావతి, 2014లో వైఎస్సార్ సీపీ నుంచి విజయం సాధించిన ఎమ్మెల్యే బానోత్ మదన్‌లాల్, 2018లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి గెలిచిన ఎమ్మెల్యే రాములు నాయక్‌లు బీఆర్ఎస్ ప్రభుత్వంలో చేరి నియోజకవర్గ అభివృద్ధి కోసం చేసింది ఏమీ లేదన్నారు. తంబర్ల నరసింహారావు, దేవరకొండ నిర్మల, కంచపోగు నరసింహారావు, శ్రీనాథ్, శరత్, బానోత్ రజనీ, లలిత, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు చరమగీతం పాడుదాం..


కాంగ్రెస్‌లో చేరిన వారితో కోరం కనకయ్య

ఇల్లెందు: కాంగ్రెస్ పార్టీని, తనను నమ్మి పార్టీలో చేరిన ప్రతీ ఒక్కరిని కడుపులో పెట్టి కాపాడుకుంటానని జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య హామీ ఇచ్చారు. మంగళవారం జేకేలోని తన క్యాంపు కార్యాలయం వద్ద వివిధ పార్టీలకు చెందిన పలువురు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా కనకయ్య మాట్లాడుతూ.. అధికార పార్టీ హామీలు అమలుకు నోచుకోవడం లేదన్నారు. ఆచరణ సాధ్యం కానీ హామీలతో కాలం వెళ్లబుచ్చిన బీఆర్ఎస్‌కు చరమగీతం పాడాలని ప్రజలు వివిధ పార్టీల నుంచి కాంగ్రెస్ వైపుకు తరలివస్తున్నట్లు చెప్పారు. తెలంగాణ ఇచ్చిన తల్లి సోనియా రుణం తీర్చుకునేందుకు వచ్చే ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు ఓటు వేయాలని, భావిభారత ప్రధానిగా రాహుల్‌గాంధీని ఢిల్లీ పీఠం ఎక్కించాలని కోరారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో ఎన్డీ, ప్రజాపంథాల నుంచి యదళ్లపల్లి యర్రయ్య, రాంబాబు, స్వామి, పాపయ్య, అనిల్, కృష్ణ, బాలకృష్ణ, చిరంజీవి, దాసు, గోపాల్, సూర్యనారాయణ, సబాస్టీన్, ఇమ్మానియేల్, సదానందం, రవి తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ పార్టీపై ప్రజలకు నమ్మకమొచ్చింది

ఇల్లెందురూరల్: కాంగ్రెస్ అధినాయత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీలనే ప్రజలు విశ్వసిస్తున్నారని జెడ్పీ చైర్మన్, కాంగ్రెస్ నాయకుడు కోరం కనకయ్య అన్నారు. మండలంలోని 21పిట్ ఏరియాలో మంగళవారం ఆయన గడపగడపకూ కాంగ్రెస్ కార్యక్రమం నిర్వహించారు. ఆరు గ్యారెంటీలను వివరిస్తూ ప్రతి ఇంటికీ కరపత్రాలను అందజేసి వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. మాట్లాడుతూ.. గతంలో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయకుండా మోసం చేసిన బీఆర్ఎస్ నాయకత్వం మరోమారు ప్రకటించిన వాగ్దానాలను ప్రజలు విశ్వసించడం లేదన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన కాంగ్రెస్‌కు ఒకసారి అవకాశం ఇవ్వాలని ఇప్పటికే ప్రజలంతా నిర్ణయించుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో పులి సైదులు, అరెం కిరణ్, ఎట్టి హరికృష్ణ, పూనెం కవిత, ధనసరి స్రవంతి, పూనెం సురేందర్, మండల రాము, ధనసరి రాజు, ముక్తి కృష్ణ, సూర్నపాక సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రేపు కంటి వైద్యశిబిరం

పాల్వంచ: ఈనెల 19వ తేదీన రిటైర్డ్ ఉద్యోగుల సంఘ భవనంలో రిటైర్డ్ ఉద్యోగులకు వరంగల్ శరత్ కంటి వైద్య వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షుడు బ్రహ్మారావు మంగళవారం ఒక ప్రకటలో తెలిపారు. కావున రిటైర్డ్ ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

బీజేపీలో పలువురి చేరిక


పార్టీలో చేరిన వారితో పూన్యా నాయక్

టేకులపల్లి: టేకులపల్లి మండలానికి చెందిన పలువురు బీజేపీలో చేరినట్లు ఆ పార్టీ ఇల్లెందు నియోజకవర్గ నాయకుడు బోడ పూన్యా నాయక్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం మండల కేంద్రంలోని గ్రావిటీ పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గంగారం, కొప్పురాయి, ధారపాడు గ్రామాలకు చెందిన పలువురు బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు చెందిన వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించినట్లు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల పట్ల ఆకర్షితులై వారంతా స్వచ్ఛంగాగా బీజేపీలో చేరినట్లు తెలిపారు.

కేసు నమోదు

ఇల్లెందు: బయ్యారం మండలం రెడ్యాతండాకు చెందిన నూనావత్ దూప్‌సింగ్ తన భార్య గీతను కొంతకాలంగా వేధిస్తున్నట్లు బాధితురాలు అందజేసిన ఫిర్యాదు మేరకు ఇల్లెందు ఎస్ఐ అప్పారావు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మండలంలోని రొంపేడు గ్రామానికి చెందిన గీతకు రెడ్యాతండాకు చెందిన దూప్‌సింగ్‌తో 2017లో వివాహం జరిగింది. భర్త దూప్‌సింగ్, అత్త లక్ష్మి, ఆడపడుచులు కవిత, జయమ్మ, సునీతలు వేధిస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

లాభాల వాటా అందజేయండి


వెల్ఫేర్ ఆఫీసర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సింగరేణి కార్మికులు

సింగరేణి(కొత్తగూడెం): ఎలక్షన్ కోడ్ పేరుతో నిలిపివేసిన సింగరేణి కార్మికుల లాభాలను వెంటనే పంపిణీ చేయాలని ఐఎన్‌టీయూసీ జనరల్ సెక్రటరీ సి.త్యాగరాజన్ పీవీకే – 5 షాఫ్ట వెల్ఫేర్ ఆఫీసర్‌కు వినతిపత్రం అందజేశారు. మాట్లాడుతూ.. ఈనెల 16న 32 శాతం లాభాల వాటాను చెల్లిస్తామని యాజమాన్యం ఈ నెల 4న సర్క్యూలర్ విడుదల చేసిందన్నారు. ఈనెల 9న ఎన్నికల కోడ్ వచ్చిందని, దీనికి ముందే లాభాలా వాటా ప్రకటన విడుదలైందని చెప్పారు. అయినా యాజమాన్యం లాభాల వాటాను నిలిపివేసిందని వెంటనే విడుదల చేయాలని, ఈ విషయాన్ని కంపెనీ ఉన్నతాధికారులకు అందజేయాలని కోరారు. సింగరేణి కార్మికుల కష్టానికి దక్కే ఫలితం ఈ వాటా ధనమని దీనికి ఎన్నికల కోడ్ వర్తింపజేయటం సరికాదని వెంటనే ఇప్పించాలని లేని పక్షంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. స్పందించిన సంక్షేమాధికారి ఉన్నాతాధికారులకు అందజేసి సమస్యలను వివరిస్తామని తెలిపారు. యూనియన్ ఉపాధ్యక్షుడు ఆల్బర్ట్, కార్మికులు పాల్గొన్నారు.

ప్రతీరోజుకో గంట నిరసన తెలపండి..

సింగరేణి కార్మికులు లాభాల వాటా వారి ఖాతాలో జమ చేసే వరకు ఉద్యోగులు రోజుకో గంట ఉద్యోగులు పెన్‌డౌన్, కార్మికులు వర్క్ టూ రూల్‌తో నిరసన తెలిపాలని హెచ్ఎంఎస్ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ పిలుపునిచ్చారు. ఎన్నికల కోడ్ అడ్డం పెట్టుకొని సింగరేణి కార్మికుల జీతాలు, లాభాల వాటా నిలిపివేసే అర్హత ఎవరికీ లేదన్నారు. ఎన్నికల కోడ్ పేరుతో సింగరేణి కార్మికుల కష్టార్జితాన్ని ప్రభుత్వానికి దోచిపెట్టే యత్నంలో సింగరేణి ఉన్నట్లు తెలిపారు. కార్మికులు ఐక్యంగా అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. ఈనెల 16న కార్మికుల లాభాల వాటా 32 శాతం అకౌంట్లో వేస్తామని 4న ప్రకటించిన యాజమాన్యం, 9న వెలువడిన ఎన్నికల కోడ్‌కు సంబంధం లేదని, కోడ్ కంటే ముందే ప్రకటించిన లాభాల వాటాను వెంటనే అందించాలని లేదంటే కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

చిత్తూ చిత్తూల బొమ్మ.. శివుని ముద్దుల గుమ్మ


ఇల్లెందురూరల్: కొమరారంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


టేకులపల్లి ట్యాంకు బజారులో బతుకమ్మ ఆడుతున్న స్థానికులు

టేకులపల్లి: మండలంలోని 36 గ్రామ పంచాయతీల్లోని గ్రామాల్లో మంగళవారం నాలుగో రోజు నానబియ్యం బతుకమ్మ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. మహిళలు, యువతులు, బాలికలు నూతన వస్త్రాలు ధరించి రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, గౌరమ్మను ప్రతిష్ఠించి నానబెట్టిన బియ్యం, పాలు, బెల్లం కలిపి నైవేద్యంగా సమర్పించారు. అనంతరం బతుకమ్మల చుట్టూ తిరుగుతూ.. 'చిత్తూ చిత్తూల బొమ్మ.. శివుని ముద్దుల గుమ్మ'.. 'శ్రీలక్ష్మి నీ మహిమలు గౌరమ్మా'.., 'పేదరాశి పెద్దమ్మ ఉయ్యాలో..' అంటూ ఆటపాటలతో సందడి చేశారు.

దూషణలకు పాల్పడితే సహించం


మాట్లాడుతున్న రాందాస్

జూలూరుపాడు: సర్పంచ్‌లపై వ్యక్తిగత దూషణలకు పాల్పడితే సహించేది లేదని సర్పంచ్‌ల సంఘం మండల ప్రధాన కార్యదర్శి గుగులోత్ రాందాస్ హెచ్చరించారు. మంగళవారం జూలూరుపాడు ఏవీఆర్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన సర్పంచ్‌ల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ పాలనలో గ్రామాల అభివృద్ధిలో కీలక పాత్ర వహిస్తున్న సర్పంచ్‌లను బెదిరింపులకు గురి చేయడం ఏమటని ఆయన ప్రశ్నించారు. సర్పంచ్‌ల స్వేచ్ఛ, హక్కులను కొందరు బీఆర్ఎస్ నాయకులు కాలరాసే విధంగా వ్యవహరిస్తున్నారని, దీనికి తగిన మూల్యం చెల్లించుకుంటారన్నారు. బీఆర్ఎస్ వైరా ఎమ్మెల్యే అభ్యర్థి అనుచరులు కొందరు సర్పంచ్‌లను బెదిరించాలని చూస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలను గడగడపకు తిరిగి ప్రజలకు వివరిస్తూ హామీలు ఇచ్చి బీఆర్ఎస్‌ను గెలిపించేది సర్పంచ్‌లే అనే విషయం మరవరాదన్నారు. మరోసారి సర్పంచ్‌లను బెదిరిస్తే ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు తగిన గుణపాఠం చెపుతామని హెచ్చరించారు. ఈ విషయాన్ని నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయి సర్పంచ్‌ల సంఘాల దృష్టికి తీసుకెళ్లి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు బానోత్ శాంతిలాల్, బోడా భోజ్యా నాయక్, భూక్యా రాములు, దొడ్డా వెంకటరామారావు, బానోత్ నరసింహారావు, లావుడ్యా కిషన్‌లాల్, గలిగె సావిత్రి, భూక్యా పద్మ, బూరం వెంకటలక్ష్మి, సపావట్ నరేష్, బోడా కృష్ణ, బానోత్ భీమా, భూక్యా లచ్చిరామ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యాలను సాధించాలి


హాజరైన విద్యార్థులు


నృత్యం చేస్తున్న విద్యార్థినులు

టేకులపల్లి: లక్ష్య సాధనలో ఎన్ని ఆటంకాలు, ఒడిదుడుకులు వచ్చినా విద్యార్థులు ముందుకు సాగాలని టేకులపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.కల్పన అన్నారు. మంగళవారం టేకులపల్లి ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఆవరణలో ద్వితీయ సంవత్సర విద్యార్థులు ప్రథమ సంవత్సర విద్యార్థులకు ఏర్పాటు చేసిన ఫ్రెషర్స్ డే ఘనంగా జరుపుకున్నారు. ఈ మేరకు ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. విద్యార్థి జీవితంలో ఇంటర్మీడియట్ స్థాయి ఎంతో ముఖ్యమైందని, ఒడిదుడుకులతో కూడినదని, కాబట్టి విద్యార్థులు క్రమశిక్షణతో సమయాన్ని సద్వినియోగం చేసుకుని లక్ష్యాలు సాధించాలని కోరారు. సెల్‌ఫోన్లు, ఫ్యాషన్ల మోజుకు గురికాకుండా తల్లిదండ్రులు వారిపై ఉంచుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా జీవితంలో ఉన్నత లక్ష్యాల సాధనకు కష్టపడాలన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో అధ్యాపకులు జయశ్రీ కృష్ణమూర్తి, బసవమ్మ సత్యవతి, ముంతాజ్ అలీ, శంకర్‌రావు, వేణుగోపాల్, యాకూబ్, వరలక్ష్మి, ప్రమోద్ కుమార్ నాగేశ్వరరావు, పుల్లారావు, రమేష్ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నవరాత్రి వేడుకలు..

ఇల్లెందు: దసరా ఉత్సవాలను పురస్కరించుకుని తొమ్మిది రోజుల పాటు నిర్వహించే శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా నియోజకవర్గ ప్రజలంతా సుఖశాంతులతో ఉండాలని, ఆ దుర్గమ్మ ఆశీస్సులు అందరి మీద మెండుగా ఉండాలని ఎమ్మెల్యే హరిప్రియ ప్రార్థించారు. మంగళవారం జేకే బస్టాఫ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపంలో ప్రత్యేక పూజలు చేశారు. నిర్వాహకులకు రూ.30 వేలు విరాళం అందజేశారు.

అన్నపూర్ణా దేవి అవతారంలో అమ్మవారు..

టేకులపల్లి: అమ్మవారి నవరాత్రి వేడుకలు మంగళవారం మండలంలో అత్యంత వైభవంగా జరుపుకున్నారు. టేకులపల్లిలోని రామాలయం వద్ద, బోడు, రామచంద్రునిపేట, కోయగూడెం, కోయగూడెం ఓపెన్‌కాస్టు తదితర గ్రామాల్లో అమ్మవారి మండపాల్లో ప్రత్యేక పూజలు చేశారు. మూడో రోజు అమ్మవారు అన్నపూర్ణాదేవి అవతారంలో భక్తులకు దర్శమిచ్చారు.

జూలూరుపాడు: శ్రీదేవీ శరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు మంగళవారం శ్రీ అన్నపూర్ణ దేవి రూపంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. పాపకొల్లు శ్రీ ఉమాసోమలింగేశ్వరాలయం, శ్రీకోటమైసమ్మతల్లి ఆలయం, బొర్రాయి(నాభిశిల) సెంటర్‌లో, కొమ్ముగూడెం శ్రీపెద్దమ్మ తల్లి ఆలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక మండపాలలో నవరాత్రి మహోత్సవ పూజలు ఘనంగా జరుగుతున్నాయి.

సురారం, జూలూరుపాడు శ్రీసీతారామాలయాల్లోను, వెంగన్నపాలెం టీచర్స్ కాలనీ, వెంగన్నపాలెం, బొర్రాయి సెంటర్(వెంగన్నపాలెం), గుండెపుడి, అనంతారం, తదితర గ్రామాల్లో శ్రీ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో కనులపండుగగా జరుగుతున్నాయి.


జూలూరుపాడు: పాపకొల్లులో అమ్మవారికి పూజలు


ఇల్లెందు: ఇందిరానగర్ మండపం వద్ద..


టేకులపల్లిలో పూజలు చేస్తున్న భక్తులు